

9న ఉగాది కవి సమ్మేళనం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉగాది సందర్భంగా ఈనెల 9వ తేదీన కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు వేదిక ప్రధాన కార్యదర్శి యువశ్రీ మురళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన తెలుపుతూ పట్టణంలోని స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో సాయంత్రం 4గంటలకు ఉగాది కవి సమ్మేళనంతో పాటు, ఇటీవల మృతి చెందిన కవి, రచయిత లగడపాటి భాస్కర్ జ్ఞాపకార్థం వారి కుమారులు కిరణ్‌కుమార్, కృష్ణ శేఖర్ సాహితీ పురస్కారాలు అందజేస్తారని అన్నారు. శతావధాని ఆముదాల మురళి, రచయిత చెంచుకృష్ణ పిళ్లైలకు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కవులు, రచయితలు, భాషాభిమానులు హాజరై విజయవంతం చేయగలరన్నారు.

ప్రయాణంలో ఇంటి భోజనం

- ప్రతి స్టేషన్‌లోనూ ముందస్తు ఆర్డర్‌తో సిద్ధం
- కొత్త వ్యాపారానికి మంచి ఆదరణ



ప్రజాశక్తి- తిరుపతి సిటి

సుదూర ప్రాంతం ప్రయాణించే ప్రయాణికులకు ముందస్తు ప్లానింగ్ లేకపోవడం, సరైన సమయం దొరకపోవడం, ఇతరాత్ర కారణాలతో ఆహారాన్ని తెచ్చుకోలేక, అలాగని రైల్వేస్టేషన్, బస్టాండుల్లో దొరికే నాణ్యత, రుచి, పరిశుభ్రత లేని ఆహారాన్ని తినలేక అనేక మంది పస్తులతో ప్రయాణం చేస్తుండడం సరామామూలే. అలా ఇబ్బంది పడే ప్రయాణికులకు ఇంటి భోజనాన్ని రుచి, శుచిగా, తాజాగా అందించాలనే ఉద్దేశ్యంతో రూపుదిద్దుకొంది. ప్రయాణంలో ఇంటి భోజనం కాన్సెప్ట్. ఏయే ప్రాంతంలో ఎన్ని గంటలకు, ఎంత మందికి భోజనం కావాలో ముందస్తుగా ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే చాలు. వారు ఆ స్టేషన్‌కు చేరుకునేసరికి తాజా భోజనం వారి చెంతకు చేరుతుంది. కొత్త వ్యాపారానికి ప్రయాణికులు ముగ్దులు కావడంతో ఆదరణ పెరిగి, దినదినాభివృద్ధి చెందుతుండడం గమనార్హం.

2019లో ప్రపంచాన్ని వణికించిన కరోనా వల్ల చాలా మందికి అనేక ఇబ్బందులు తప్పలేదు. చాలా ఇళ్లల్లో ఇల్లాలు కరోనా భారిన పడడంతో ఆ ఇంటి వారికి ఆహార సమస్య తలెత్తింది. కొన్ని ప్రాంతాల్లో ఆసుపత్రిలో, క్వారెంటైన్‌లో ఉండే వారికి కూడా సరైన ఆహారం దొరకడం కష్టంగా మారింది. తిరుపతి ఆధ్యాత్మిక ప్రాంతంలో విష్ణునివాసం, శ్రీనివాస కాంప్లెక్స్, తిరుచానూరు పద్మావతి నిలయంలో ఉండే వారికి టిటిడి, చంద్రగిరి ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు ఆహార సరఫరా చేశారు. మిగిలిన ప్రాంతాల్లో ఉన్న వారికి ఆహారం దొరక్క ఇబ్బంది పడ్డారు. సరిగ్గా అదే సమయంలో తిరుపతికి చెందిన లక్ష్మీకి ఓ సరికొత్త ఆలోచన వచ్చింది. బోజనం కోసం ఇబ్బంది పడుతున్న వారికి పౌష్టికాహారాన్ని సరఫరా చేయాలని తలిచింది. అనుకున్నదే తడువుగా వెనువెంటనే శ్రీబ్రాహ్మణ కర్రీపాయింట్‌ను స్థాపించిపంది. 99598 59227 ఫోన్ నెంబరుకు ఆర్డరు ఇస్తే చాలు తిరుపతి, పరిసరాల ప్రాంతాల్లో ఎక్కడికైన వీలైంనత తక్కువ సమయంలో శుచి, రుచి కల్గిన ఆకు కూరలు, కూరలు, వేపుళ్లు (కర్రీస్) సరఫరా చేసేది. ఒక పక్క కరోనో విజృంభిస్తున్న లెక్క చేయకుండా పది మందికి పౌష్టికాహారం ఇవ్వాలని తలిచి, బోజన సరఫరాను కూడా ప్రారంభించింది. ప్రతి రోజు వందలాది మందికి బోజనం అందించేది. ఒక పక్క కరోనా బాధితులకు పౌష్టికాహారం ఇస్తూనే, మరో పక్క వ్యాపార పరంగా కుటుంబ పోషణనకు బాటలు వేసింది. భర్త, పిల్లలు, కుటుంబ సభ్యులు సహకరించడంతో వ్యాపారం జోరందుకుంది. కొన్ని రోజులకు రాను రాను కరోనా తగుముఖం పట్టింది. లాక్‌డౌన్లు దశలవారీగా సడలించారు. దీంతో ఆమె కర్రీస్ పాయింట్‌కు ఆర్డర్లు తగ్గుముఖం పట్టాయి. అయిన ఆమె అదైర్యపడకుండా కర్రీస్ పాయింట్‌తో పాటు క్యాటరింగ్‌ను ప్రారంభించింది. ఇళ్లల్లో జరిగే అన్ని రక ఆల శుభకార్యాలకి, గృహప్రవేశాలకు, పెళ్లిళ్లకు, నోములు, వ్రతాలు, కిట్టి పార్టీలకు, బ్రహ్మణ బోజనాన్ని కోరిన విధంగా క్యాటరింగ్ పద్ధతిలో అందించేంది. దేవాలయాలకు మడిగా ప్రసాదాలు అందజేయడం వీరి ప్రత్యేకత. ఆ నేపథ్యంలో ఆమెకు మరో కొత్త ఆలోచన పుట్టుకొచ్చింది. తిరుపతి ఆధ్యాత్మిక క్షేత్రం కావడంతో దేశ నలుమూలల్లోని సుదూర ప్రాంతాల నుంచి రకరకాల ప్రాంతాలకు చెందిన వారు తిరుమల శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వస్తుంటారు. తిరుపతికి ప్రతి రోజు లక్ష మంది యాత్రికులు రాకపోకలు సాగిస్తున్నారు. తిరుపతికి వచ్చే వారిలో అధిక మంది హోటల్ ఫుడ్ పట్టక, సరైన, నాణ్యమైన భోజనం అందక ఇబ్బంది పడుతున్నారని గమనించింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి తాజా, శుచి, రుచికరమైన బ్రాహ్మణ పద్ధతిలో శాఖహార భోజనాన్ని అందించాలని భావించింది. తిరుపతి మీదుగా ప్రయాణించే వారు ముందస్తుగా తమ ఫోన్‌కు సమాచారం ఇచ్చి, ఏ సమయానికి, ఎక్కడికి, ఎంత మందికి భోజనం కావాలో తెలియజేస్తే చాలా ఆ సమయానికి అక్కడికి తాజా పౌష్టికాహారాన్ని అందించేలా వ్యాపారాన్ని ప్రారంభించింది. దీనికి ఆదరణ దక్కడంతో విజయవాడ, గుంటూరు, విశాఖపట్టణం నుంచి స్థానిక వ్యాపారులు వీరిని సంప్రదించి, బ్రాంచిలను ఏర్పాటు చేశారు. ప్రయాణ భోజనం సరఫరా ప్రచారం అందరికీ చేరడంతో అటు ప్రయాణికులు, ఇటు వ్యాపారులు ఆయా ప్రాంతాల వారిని సంప్రదించడం పెరిగింది. దీంతో లక్ష్మీని ఫోన్ ద్వారా సంప్రదించిన వారికి ఆయా స్టేషన్‌లో బోజనం సరఫరా ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రస్తుతం విజయవాడ, బెంగుళూరు, సికింద్రాబాద్, విశాఖపట్టణం (వైజాగ్), కాకినాడ, తిరుపతి, న్యూడిల్లీ, చెన్నయ్ తాంబరం, రాజమండ్రి, నెల్లూరు, వారణాసి, షిర్డి, ఒరిస్సా, గుంటూరు, అరుణాచలం, ఏలూరు, ఒంగోలు ప్రాంతాల్లో ఆంధ్ర బ్రాహ్మణ భోజనాన్ని ప్రయాణీకులకు చేరువేస్తున్నారు. రైలు, బస్సు, కారు, ఇతర వాహనాల్లో వచ్చే వారికి కూడా ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చారు. తిరుపతి కేంద్రంగా జరుగుతున్న ఈ వ్యాపారం ద్వారా లక్ష్మీ ప్రతి రోజు రూ.1000 నుంచి 1500ల వరకు ఆదాయాన్ని అర్జిస్తుంది. వారాంతపు రోజుల్లో (వీకెండ్ డేస్‌లు) రోజుకు 3వేల రూపాయలకు వరకు ఆదాయం సంపాదిస్తుంది. ప్రస్తుతం పిల్లల పరీక్షల సమయం కావడంతో ఆ మాత్రం వ్యాపారం, ఏఫ్రిల్‌లో సెలువులు ప్రారంభమైతే ప్రయాణికులు తాకిడి ఎక్కవుగా ఉంటుంది. ఆ సమయంలో రోజుకు రూ.3 నుంచి 4వేల వరకు, నెలకు రూ.లక్షా 50వేల వరకు ఆదాయం వస్తుంది. ఈ సరికొత్త వ్యాపారానికి ఆదారణ పెరుగుతుండడం గమనార్హం.



సేవతో పాటు ఆదాయం కూడా..

ప్రయాణికులు ఇంటి భోజనం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఆహార సరఫరా వ్యవస్థ ద్వారా ప్రయాణికులు అనుకున్న సమయానికి, అనుకున్న ప్రాంతానికి తాజా, రుచికరమైన భోజనాన్ని అందిస్తు సేవ చేస్తూ, వారి మన్ననలను పొందుతున్నాం. ఇది ఆత్మసంతృప్తిని ఇస్తుంది. ఇంకో పక్క వ్యాపార పరంగా ఆదాయం వస్తుండడంతో కుటుంబ పోషణ కూడా బాగా ఉంది.

- లక్ష్మీ, బ్రాహ్మణ భోజనం క్యాటరింగ్ అధినేత, తిరుపతి

పొంచి ఉన్న తాగునీటి ఎద్దడి

- తెలుగు గంగనీరు 40 రోజులే..
- కళ్యాణీ సెప్టెంబర్ వరకే..
- కార్పొరేషన్‌లో విలీనమైన పంచాయతీలో నీటి కటకట
- కమిషనర్, ఇంజనీరింగ్ అధికారుల సమన్వయ లోపం
- రాజకీయ నేతలకు తప్పని నీటి బెడద



కళ్యాణీ డ్యాం

ప్రజాశక్తి- తిరుపతిటౌన్

తిరుపతి ఆధ్మాతిక నగరానికి నీటసమస్య పొంచి ఉంది. తెలుగు గంగనీరు రోజుమార్చి రోజు సరఫరా చేసినా కేవలం 40రోజులు మించి నీళ్లు రావడం కష్టమని తెలుస్తుంది. కళ్యాణీ డ్యాంలోని నీటిని రోజుమార్చి రోజు సరఫరా చేసిన కేవలం సెప్టెంబర్ నెలవరకే వస్తాయి. తెలుగుగంగ, కళ్యాణి డ్యాంలలో రోజురోజుకు నీటిమట్టం తగ్గుతుంది. వేసవిలో మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు, కమిషనర్ అదితి సింగ్ మధ్య సమన్వయం లేకపోవడం ఒక కారణమైతే, అధికారులు అస్లెంబీ, పార్లమెంట్ ఎన్నికల్లో తలమునకైలే ఉండడం వల్ల తిరుపతి ప్రజలకు దాహర్తిని పూర్తిగా విస్మరించారు. కమిషనర్ అదితిసింగ్ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి నగరపాలక సంస్థ అభివృద్ధి గురించి పట్టించుకోకపోవడం మరో సమస్యగా మారింది. ఆమె కమిషనర్‌గా పనిచేయడం లేదని చుట్టపుచూపుగా వచ్చిన్నట్లుగా ఉందని నగరవాసులు ఆరోపిస్తున్నారు.

గతంలో ఇక్కడ కమిషనర్‌లుగా పనిచేసిన వారు వేసవికాలం వచ్చిందంటే తాగునీటి సమస్యపై ముందుగా చర్యలు తీసుకునేవారు. కార్పొరేషన్‌లో విలీనమైన శెట్టిపల్లి పంచాయతీ ప్రతిరోజు తాగునీటి సమస్యతో అల్లాడుతున్నారు. ఎంఆర్‌పల్లి పంచాయతీలో కొన్ని వీధుల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. నగరంలో రోజుమార్చి రోజు 30 నుంచి 40 నిముషాలకు మించి తాగునీరు సరఫరా చేయడం లేదు. జిల్లా కలెక్టర్ అప్రమత్తమై తాగునీటి సమస్యపై యుద్ధప్రాతిపదిక చర్యలు తీసుకోవాలని సమావేశాలు పెడితే మన మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పరుగులు తీసున్నారు. ఎన్నికలవేళ ప్రజాప్రతినిధులను తాగునీటి సమస్యపై నిలదీస్తున్నారు. ఓటు అడిగేందుకు వీధివీధి తిరుగుతున్న రాజకీయపార్టీలకు ఈ బెడద తప్పడం లేదు. ఎన్నికలు అయ్యేవరకైయినా సక్రమంగా నీటిని సరఫరా చేయాలని, లేదంటే ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపుతుందని రాజకీయపార్టీల నేతలు ఆందోళన చెందుతున్నారు.

తాజాగా మూడు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఇంకా ప్రభుత్వ యూనివర్శిటీలు, ఆసుపత్రులకు మీటర్ల పెట్టి సరఫరా చేస్తున్నారు. నగరంలో సుమారు 3లక్షల మంది జనాభా నివాసిస్తున్నారు. తిరుపతికి రోజుకు 80వేల మంది యాత్రికులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రధాన నీటి వనరులు తిరుపతి వాసులకు తెలుగుగంగ నీళ్లు ఇవి శ్రీకాళహస్తి కైలస రిజర్వాయి నుంచి రామపురం రిజార్వాయి ద్వారా సుమారు 37కిల్లోమీటర్ల పైపులైన్ ద్వారా సరఫరా అవుతుంది. నగరంలో 12 ఫ్లింటర్ ట్యాంకులు ఉన్నాయి. వీటి ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతోపాటు అమృత్ పథకంలో నిర్మించి 11ట్యాంకులు ఏర్పాటు చేసి నీటి అందిస్తున్నారు. తెలుగుగంగతోపాటు చంద్రగిరి నియోజకవర్గంలో కళ్యాణిడ్యాం ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. రామపురం రిజర్వాయి వద్ద విద్యుత్ సమస్యలు వస్తే తెలుగు గంగ నీళ్లు సరఫరా సమస్య ఏర్పడుతుంది. వేసవి కాలంలో మందుస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈసమస్యలు వస్తున్నట్లు నగర వాసులు అంటున్నారు.

రోజుకు 65ఎంఎల్‌డిలు డిమాండ్

తిరుపతి వాసులకు రోజుకు 65ఎంఎల్‌డిల నీరు డిమాండ్ ఉండగా నగరపాలక సంస్థ తెలుగుగంగ ద్వారా 40 ఎంఎల్‌డిలు, కళ్యాణిడ్యాం ద్వారా 20 ఎంఎల్‌డిలు, 534 చేతిబోర్ల ద్వారా 1.47 ఎంఎల్‌డిల నీటి అందిస్తున్నట్లు చెబుతున్నారు. మొత్తం 62ఎంఎల్‌డిలు నీటిని సరఫరా చేస్తున్నారు. 3ఎంఎల్‌డిలు తక్కువగా ఉంది. నీటి సమస్య ఉన్న డివిజన్‌లో రోజుకు 16 నీటి ట్యాంకర్ల ద్వారా పాయింట్ 75ఎంఎల్‌డిలు ప్రజలకు సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నారు. నీటి సమస్య ఉన్న చోట్ల తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నారు. అమృత్ పథకంలో కొన్ని ట్యాంకులు నీటిని నింపడం లేదు.కొన్ని ట్యాంకులు పూర్తికావాల్సి ఉంది.



తెలుగుగంగ

చేతులెత్తేసిన కౌన్సిల్


అసలు తిరుపతి నగరపాలక కౌన్సిల్ ఉందా..? అన్న అనుమానం వస్తుంది. తాగునీటి సమస్య ఉంటే ఎందుకు రెండునెలలు క్రితం అత్యవసర సమావేశం పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపణలు ఉన్నాయి. నగరంలో మురికి వాడ ప్రాంతాల్లో నీటసమస్య ఎక్కువ ఉంది. ఆయా ప్రాంతాంలో కొంతమంది కార్పొరేటర్లు నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించే కార్యక్రమం చేస్తున్నారు. మరికొన్ని మురికివాడలో మున్సిపల్ నీటిట్యాంకర్ల ద్వారా వస్తున్నాయి. అది కూడా కనీసం పది బిందెలు నీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ ట్యాంకర్లు ఎక్కువ మధ్యాహ్నం పూట రావడంతో అంత ఎండలు మహిళాలు నీటికోసం తిరిగి తిరిగి వడదెబ్బకు గురివుతున్నారు. నీటి సమ్యస ఉన్న డివిజన్‌లో చాలామంది ప్రైవేట్ నీటి ట్యాంకర్లు తొలుకుంటున్నారు. ప్రైవేట్ ట్యాంకర్ల యజమానులు రూ.1000లు నుంచి 5వేలు తక్కువ లేకుండా వసూళు చేస్తున్నారు. ముఖ్యంగా అపార్టుమెంట్ వాసులు, వ్యాపార సముదాయం కలిగిన వారు తప్పకుండా కొనుగోలు చేయాల్సి వస్తోంది.

నీటి సమస్య లేకుండా చర్యలు..

- మోహన్, ఎస్ఇ

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని మన్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ సూపరింటెండెంట్ టి.మోహన్ తెలిపారు. తెలుగుగంగ నీటిని పంపింగ్ చేసుకోవడానికి చర్యలు చేపట్టమని చెప్పారు. రామాపురం వద్ద విద్యుత్ సరఫరా సమస్య వచ్చి తెలుగుగంగ నీటికి అంతరాయం కలిగిందని దాని వల్లే ఈసమస్య అని పేర్కొన్నారు. విద్యుత్ సమస్య ఏర్పడకుండా ఉండేందుకు ఎస్‌పిడిసిఎల్ అధికారులతో సంప్రదించిన్నట్లు చెప్పారు.

చంద్రబాబు నాయుడుకు ఘనంగా వీడ్కోలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి


టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు ఆదివారం శ్రీకాళహస్తి టీడీపీ, జనసేన, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు. శ్రీకాళహస్తిలో శనివారం నిర్వహించిన ప్రజాగళం రోడ్‌షోకు చంద్రబాబు నాయుడు హాజరైన సంగతి తెలిసిందే. ఆ రాత్రి ఆయన శ్రీకాళహస్తి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బస చేశారు. ఉదయం 10.30గంటల సమయంలో ఆయన ఎమ్మిగనూరు సభకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా జ్ఞాన ప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి విభూది, కుంకుమను బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి స్వయంగా నారా చంద్రబాబు నాయుడు నుదుటిపై పెట్టి స్వామి వారి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన

11 మంది వలంటీర్ల తొలగింపు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: భారత ఎన్నికల సంఘం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ సంచాలకులు వారి ఆదేశాల నేపథ్యంలో తిరుపతి జిల్లాలోని అందరు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమీషనర్లు వారి పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాలలోని వలంటీర్లకు అందించబడిన హ్యాండ్ హెల్డ్ పరికరాలు (మొబైల్, ట్యాబ్, ఇతరములు) ఎన్నికల ప్రవర్తనా నియమావళి వ్యవధి ముగిసే వరకు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలో జమ చేయవలసినదిగా తిరుపతి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికారులు తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. తిరుపతి జిల్లాలో ఎంసిసి కోడ్ అమలులో ఉన్నప్పటినుండి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అతిక్రమించినందుకు 11మంది వలంటీర్లను తొలగించినట్లు పేర్కొన్నారు. ఇందులో ఏర్పేడు నలుగురు, నారాయణవనంలో ముగ్గురు, రేణిగుంటలో ఒకరు, పుత్తూరులో ఒకరు, బి.ఎన్ కండ్రిగ ఇద్దరు ఉన్నట్లు తెలిపారు.

చంద్రబాబును కలసిన వినుత దంపతులు



ప్రజాశక్తి- శ్రీకాళహస్తి

టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడును ఆదివారం జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి వినుత కోటా, ఆమె భర్త చంద్రబాబు కలిశారు. ప్రజాగళం సభకు హాజరైన చంద్రబాబు నాయుడు శ్రీకాళహస్తిలో బస చేశారు. ఈసందర్భంగా వినుత కోటా దంపతులు ఆయన్ను కలిశారు. శ్రీకాళహస్తిలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకటసుధీర్ రెడ్డికి మద్దతు తెలిపి గెలిపించాలని వినుత కోటా దంపతులకు చంద్రబాబునాయుడు సూచించారు. ఇందుకు వారు అంగీకరించారు.

నేను లోకల్.. నువ్వు నాన్ లోకల్...

నిన్ను కలవాలంటే ఫ్లైట్.. నన్ను కలవాలంటే ఆటో

అవినీతిపై దైవం వద్ద ప్రమాణంకు సిద్ధమా సుధీర్

ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి



ప్రజాశక్తి- శ్రీకాళహస్తి : నిరంతరం హైదరాబాదులో ఉండే నిన్ను ప్రజలు కలవాలంటే ఫ్లైట్ ఎక్కాలనీ, అదే నిత్యం శ్రీకాళహస్తిలో ఉండే నన్ను కలవాలంటే ఆటో చాలంటూ స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కూటమి అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని ఉద్దేశించి ఘాటు విమర్శలు చేశారు. అవినీతిపై ఆవాకులు, చవాకులు పేలుతున్న సుధీర్ రెడ్డి వాటి నిరూపణకు దైవం వద్ద ప్రమాణం చేసేందుకు సిద్ధమా..? అంటూ సవాల్ విసిరారు. స్థానిక వైసిపి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదివారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. శనివారం జరిగిన ప్రజాగళం రోడ్ షోలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన తీరు హాస్యాస్పదమన్నారు. ఆయన వయసుకు తగ్గ మాటలు కాదని విమర్శించారు. ఎర్రచందనం, ఇసుక, మద్యంలో మాఫియా కింగ్ సుధీర్ రెడ్డిని పక్కన పెట్టుకొని నా పైన విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. చంద్రబాబు ప్రజాగళం రోడ్ షోకు కనీసం 4 వేల మంది జనాలు రాలేదనీ, ఒక సాధారణ ఎమ్మెల్యే అయినా నా పుట్టినరోజుకు 70 వేల మంది అభిమానులు తరలి వచ్చారని గుర్తు చేశారు. మీది పెత్తందార్ల పార్టీ అయితే మాది ప్రజల పార్టీ అనీ, ఆ ప్రజా బలంతోనే రానున్న ఎన్నికల్లో గెలవబోతున్నామని జోష్యం చెప్పారు. నా ఒత్తిడి వల్ల లాంకో పరిశ్రమ 15 రోజులు మూతపడిందని ఆరోపించిన చంద్రబాబు, ఆ ఆరోపణలు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్నారు. మరి నిరూపించలేకుంటే చంద్రబాబు తన పదవికి రాజీనామా చేస్తారా అంటూ సవాల్ విసిరారు. నిత్యం హైదరాబాదులో ఉండే సుధీర్ రెడ్డి నాన్ లోకల్ అనీ, నిరంతరం ప్రజల్లో ఉండే తాను లోకల్ అని చెప్పుకొచ్చారు. ఐదేళ్లలో తాను చేసిన అభివృద్ధిపై, 30 ఏళ్లలో బొజ్జల చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఇకనైనా చంద్రబాబు, లోకేష్, సుధీర్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలనీ, లేకుంటే రానున్న ఎన్నికల్లో ప్రజలే గట్టి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి, ఆలయపాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఉన్నం వాసుదేవ నాయుడు, గుమ్మడి బాలకృష్ణయ్య, జయ గోపాల్, పసల సుమతి తదితరులు పాల్గొన్నారు.

ప్రసార మాధ్యమాల్లో ప్రకటనలకు

ఎంసిఎంసి అనుమతి తప్పనిసరి : కలెక్టర్



ప్రజాశక్తి- తిరుపతిటౌన్: సాధారణ ఎన్నికలు-2024 సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి ప్రసార మాధ్యమాల్లో ప్రసారమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి జిల్లా కలెక్టర్ వారి అధ్యక్షతన జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి ఇవ్వడంతో పాటు, చెల్లింపు వార్తలను (పెయిడ్ న్యూస్) ఈ కమిటీ పర్యవేక్షిస్తుందని, మీడియా ఉల్లంఘనలు కూడా గుర్తించి తగినచర్యలు తీసుకుంటుందన్నారు. రిజిస్టర్ కాబడిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలు గానీ వారి తరపున ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులు ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలను ప్రసారం చేసేందుకు అనుమతి కోసం నిర్ణీత నమూనాలో మూడు రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రిజిస్టర్ కానటువంటి రాజకీయ పార్టీలు, ఇతర వ్యక్తులు వారి ప్రకటన ప్రసారం చేయుటకు ఏడు రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు అందిన రెండు రోజుల్లోగా జిల్లాస్థాయి ఎంసీఎంసీ కమిటీ సదరు ప్రచార అంశాలు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి ఉన్నచో అనుమతి మంజూరు చేస్తుందన్నారు. వార్తాపత్రికల్లో పోలింగ్ రోజు, పోలింగ్‌కు ముందు రోజు తప్పనిసరిగా ఎంసీఎంసీ నుంచి అనుమతి పొందిన తరువాతనే ప్రకటన ప్రచురించాల్సి ఉంటుందన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి అన్ని రకాల టెలివిజన్ ఛానళ్లు, కేబుల్ నెట్వర్క్‌లు, డిజిటల్ డిస్ప్లేలు, మొబైల్ నెట్ వర్క్ ల ద్వారా ఎస్ఎంఎస్, వాయిస్ మెసేజ్ లు వస్తాయని, అలాగే సామాజిక మాధ్యమాలైన (సోషల్ మీడియా) ఫేస్ బుక్, ట్విట్టర్, యూట్యూబ్, ఇన్ స్టాగ్రామ్, వాట్సాప్, గూగుల్ వెబ్ సైట్స్ కూడా ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి వస్తాయని తెలిపారు. అలాగే సినిమా హాళ్లలోనూ, ప్రైవేట్ ఎఫ్ఎం రేడియోలలో, ఎలక్ట్రానిక్ పత్రికలలోను, ప్రసారమయ్యే, ప్రచురితమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలు కూడా తప్పనిసరిగా ముందస్తు ధృవీకరణ పొందాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులు టీవి, కేబుల్ టీవి, రేడియో, డిజిటల్ స్క్రీన్స్, వాహనాలలో ప్రచార ప్రకటనలకు ముందస్తుగా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) టెలికాస్ట్ సర్టిఫికెట్ పొందిన తర్వాతనే ప్రచారం చేపట్టాల్సి వుంటుందన్నారు. ఎంసీఎంసీ అనుమతి లేకుండా చేసే ప్రసారాలు, ప్రకటనలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలుగా పరిగణించి, తగిన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

యథేచ్ఛగా ఇసుక్ర అక్రమ రవాణా

అడ్డుకున్న రైతులపై దాడి

అధికారుల నిర్లక్ష్యమే అంటున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- పిచ్చాటూరు

మండలం పులికుండ్రం నదీ పరీవాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. రెవెన్యూశాఖ నిర్లక్ష్యంతో స్థానిక వైసిపి నాయకుడు, సర్పంచ్ అన్న దొరై, ఆయన అనుచరుడు వెంకటేష్ బడా నాయకుల అండ చూసుకుని రాత్రింబవళ్లు తేడా లేకుండా ఇసుకను అమ్మి సొమ్ము చేసుకుంటున్నా వారిపై చర్యలు తీసుకోవడం లేదంటూ గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కావడం లేదని దీని వలన గ్రామ చుట్టుపక్కల ఉన్న భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఆదివారం ఉదయం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామ రైతులు అడ్డుకున్నారు. దీంతో వారు రైతులపై దాడికి తెగబడ్డారు. తమని ఎవరూ ఏమీ చేయలేరంటూ కత్తులతో దాడిచేస్తామని బెదిరించడంతోపాటు తమ ఎదిరించిన వారు ఊరు దాటలేరంటూ సవాల్ విసురుతున్నారని తెలిపారు. దీనిపై ఎస్ఐ వెంకటేశులును వివరణ కోరగా సర్పంచ్ అనుచరుడు వెంకటేష్‌పై కేసు నమోదు చేయడంతోపాటు జరిమానా విధించడం జరిగిందని, అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇకపై అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇళ్ల స్థలాలు అడిగితే ..

అరెస్టు చేయడం అన్యాయం: సిపిఎం

ప్రజాశక్తి- రేణిగుంట: మండలంలోని కరకంబాడీ పంచాయతీకి చెందిన పేదలు ఇళ్ల స్థలాలు అడిగిన పాపానికి 17మందిని రేణిగుంట పోలీసులు అరెస్టు చేయడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పట్టాలి ఇచ్చి నాలుగు సంవత్సరాలు దాటుతున్న స్థలాలు చూపక ఆఫీసులు చుట్టూ తిప్పుకుంటూ ఇబ్బంది పెడుతున్న వైనాన్ని వ్యతిరేకిస్తూ పేదలు గతంలో ఎర్రగుట్ట మీద గుడిసెలు వేసి పోరాటాన్ని ప్రారంభించారని తెలిపారు. నెల రోజుల నుండి జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవో, తహశీల్దారు చుట్టూ తిరుగుతున్నప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. పేదలు తమ ఇళ్ల స్థలాల కోసం గట్టిగా అడుగుతున్నారనే నెపంతో పేదలకు అండగా ఉంటున్నారని సాకుతో సిపిఎం మండల కార్యదర్శి కే.హరినాథ్, రాజా, శివానందం, సత్యశ్రీ, సెల్వ రాజుతో పాటు 17 మందిని తెల్లవారుజామున మఫ్టీలో వచ్చి అక్రమంగా అరెస్టు చేసి బైండోవర్ కేసులు పెట్టి భయపెడుతున్నారని దీనిని సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. ఇప్పటికైనా అధికారులు పేదలకు ఇచ్చిన పట్టాలకు, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు చూపించాలని, కబ్జాలకు పాల్పడుతున్న వైయస్సార్ పార్టీ నాయకులు నుంచి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నదని అన్నారు. ఇటువంటి అపరాజస్వామిక చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు.



నవోదయ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ


పూవరసి

ప్రజాశక్తి-పిచ్చాటూరు: పట్టణానికి చెందిన ఎలక్ట్రీషన్ ఆనంద్ కుమార్తె పూవరసి నవోదయకు ఎంపికైయ్యారు. కాగా ఫిబ్రవరి 10న పరీక్ష రాశారు. ఆదివారం ఫలితాలు వెలువడ్డాయి. 9వ తరగతి అడ్మిషన్‌కు ఎంపికైయ్యారు. విద్యార్థినిని పలువురు అభినందించారు.


గంధం జాను

శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం లింగమనాయుడుపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న గంధం సురేష్, భూలక్ష్మి దంపతుల కుమార్తె గంధం జాను జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం రాంబాబు తెలిపారు. నవోదయ సీటు సాధించిన జానుని ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.

ప్రేమ్‌కుమార్‌రెడ్డికి పరామర్శ

ప్రజాశక్తి-రామచంద్రాపురం: మండలంలోని నూతు గుంటపల్లికి చెందిన ప్రేమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల జరిగిన ప్రమాదంలో తలకు గాయమైంది. ఆయన స్విమ్స్‌లో చికిత్స తీసుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న టీడీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పరామర్శించి ధైర్యం చెప్పారు. నాని వెంట ఉమాపతి నాయుడు, లీలా మోహన్ నాయుడు, విజయ్‌కుమార్ రెడ్డి, మధు, వెంకటేష్ రెడ్డి, చిట్టిబాబు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కోట: మండలంలోని గోడలు పంచాయతీ పరిధిలోని అభయ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద జనతా క్లినిక్ డాక్టర్ జగదీష్ సౌజన్యంతో నూతనంగా కూలింగ్ ఫ్రిడ్జ్‌తో చలివేంద్రంను ఏర్పాటు చేశారు. వైసిపి నాయకులు షనీల్ రెడ్డి, విజయసారధి రెడ్డిల చేతులు మీదగా ప్రారంభించారు. కార్యక్రమంలో నాగార్జున్, బుల్లయ్య, రాజనాల, రాఘవ పాల్గొన్నారు.

ఐఐటి శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ పాఠశాలలో ముంబైకి చెందిన లీడ్ ఫౌండేషన్ కంపెనీ సహకారంతో విద్యార్థులకు ఐఐటి శిక్షణ ఇసున్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు ఆదివారం ఈ శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో బాలాజీ, నమశ్శివాయ, శ్రీలత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిరం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 39వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా డాక్టర్ జనార్ధన్ రెడ్డి, డాక్టర్ సిద్ధారెడ్డి, వినోద్ రెడ్డి విచ్చేశారు. విద్యా భారతి ఏపీ సంఘటన కార్యదర్శి కన్నా భాస్కర్ రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ డోలు విద్వాంసులు రాష్ట్రపతి అవార్డు గ్రహీత శ్రీ వినుకొండ సుబ్రమణ్యంని ఘనంగా సన్మానించారు. స్కూలు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శిశు మందిరం హెచ్‌ఎం రంగనాయకులు, ఉపాధ్యాయులు రామ్మోహన్, విశ్వేశ్వరరావు, ప్రసాద్ రెడ్డి, సనత్‌కుమార్ రెడ్డి, రవిచంద్ర రెడ్డి, రూపేష్ రెడ్డి, చంద్రారెడ్డి, రవికుమార్, వెంకట రమణయ్య పాల్గొన్నారు.

ఈస్టర్ వేడుకలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని క్రైస్తవులు ఈస్టర్ పండుగ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా చర్చిల్లో బైబిల్ పఠనం చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు మానవుల పాపాలకై శుక్రవారం నాడు సిలువ వేయబడి ఆదివారం నాడు సమాధి నుండి పైకి లేచిన జనం కావడంతో క్రైస్తవ సోదరులు ఈస్టర్ పండగను ఘనంగా జరుపుకుంటారని క్రైస్తవ మత బోధకులు మెర్సీ శాంతి బాబు తెలిపారు, అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పాస్టర్ వెంకట్రావు, జితేంద్ర నాయుడు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: పట్టణంలోని ఎన్‌జీవో కాలనీ చర్చిలో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ సెల్వం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చిరంజీవి, విజయ్ కుమార్, జీవన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: ఆధ్యాత్మికత మానవసేవే రంజాన్ మాస ప్రాముఖ్యత అని షేక్ రియాజ్ అహ్మద్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని దర్గా వీధిలోని నివాసం నందు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సోదరులతో కలిసి వంద మందికి చీరలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రంజాన్ నెల పేదల మాసమని ప్రతి ముస్లిం ఆధ్యాత్మికతతో పాటు పేదలకు సేవ చేయడం రంజాన్ మాస విశిష్టతని పేర్కొన్నారు. ప్రతి ఏటా రంజాన్ మాసంలో నిర్వహించే సేవా కార్యక్రమంలో భాగంగా చీరల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో షేక్ ఇలియాస్ అహ్మద్, దర్గా కమిటీ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్, దర్గా ముజావర్ మగ్దూం మొహద్దీన్, షేక్ నూర్ అహ్మద్, షేక్ సహనవాజ్, షేక్ చాంద్ భాషా, షేక్ రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

గాయత్రికి డాక్టరేట్



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళ యూనివర్సిటీ ఆంగ్ల విభాగం పరిశోధక విద్యార్థి విఆర్ గాయత్రికి విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆచార్య శారద మార్గదర్శకత్వంలో "డయాస్పోరిక్ కన్సర్సెన్ ఇన్ ది సెలెక్ట్ నావెల్స్ ఆఫ్ మోనిక అలీ ఎస్టడి" అనే అంశంపై గాయత్రి పరిశోధన గ్రంథం సమర్పించినందుకు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, పరిశోధకులు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులు సైకాలజీ అధ్యయనం పట్ల ఆసక్తి చూపాలి: ఎస్వీయు విసి

- ముగిసిన రెండవ అఖిల భారతీయ సంస్కృత విద్యార్థుల ప్రతిభా సమారోహం



ప్రజాశక్తి-క్యాంపస్: విద్యార్థులు సైకాలజీ అధ్యయనం పట్ల ఆసక్తి చూపించాలని ఎస్వీయూ విసి శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరుగుతున్న రెండవ అఖిల భారతీయ సంస్కృత విద్యార్థుల ప్రతిభా సమారోహం ఆదివారం ఘనంగా ముగిసింది. గత నాలుగు రోజులుగా వివిధ సంస్కృత శాస్త్రాలలో భాషణ-సాంస్కృతిక-క్రీడ, యోగ విషయాలలో ఈ ఫెస్టివల్ నిర్వహించడం జరిగినది. కార్యక్రమానికి ముఖ్య అతిథులు, శ్రీకంచి కామకోటి పీఠాధిపతులు పూజ్యులు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ఆన్లైన్ మాధ్యమంలో అనుగ్రహభాషణ చేయడం జరిగింది. ఆయన మాట్లాడుతూ సంస్కృతాన్ని ఇంకా అభివృద్ధి చేయాలని, అదేవిధంగా శంకరాచార్యులు చూపించినటువంటి మార్గం ఏదైతే ఉందో దాన్ని అనుసరిస్తూ కొన్ని అద్వైత-ద్వైత-విశిష్టాద్వైత వాటికి సంబంధించినటువంటి విషయాలలో కూడా విశేష కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎస్వీయూ వీసీ ప్రొ.వి.శ్రీకాంత్ రెడ్డి విచ్చేసి సంస్కృత భాషలో వివిధ శాస్త్రాలలో పోటీలు నిర్వహించడం, ఈ కార్యక్రమానికి మమ్మల్ని ఆహ్వానించడం మధురానుభూతి కలిగించిందని వివరించారు. చాలామంది విద్యార్థులు ఇక్కడ ఉన్నటువంటి వారు సైకాలజీలో అధ్యయనం చేయడం ఆనందదాయకమని వివరించారు. ఇంతటి చక్కటి టాలెంట్ ఫెస్టివల్ నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని అభినందించారు. విశిష్ట అతిథిగా తిరుపతి సిఐడి యొక్క ఎస్పీ ఎస్.వి.ఎస్ స్వామి మాట్లాడుతూ ఇక్కడ ఇటువంటి చక్కటి టాలెంట్ ఫెస్టివల్ నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని, వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు విచ్చేసి పోటీల్లో వారు పాల్గొనడం బహుమతులు పొందడం వారి యొక్క ప్రతిభకు నిదర్శనమని, ఈ కార్యక్రమాన్ని నిర్వహించినటువంటి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, ఆయోజకులకు వారి అభినందనలు తెలిపారు. సారస్వత అతిథిగా తమిళనాడులోని కాంచీపురంలోని శ్రీ చంద్రశేఖరేంద్ర విశ్వవిద్యాలయం యొక్క భూతపూర్వ వైస్ ఛాన్సలర్ ప్రొ.విష్ణుపోతి విచ్చేసి, సంస్కృతం, సంస్కృత భాష సంరక్షించడం కొరకు అఖిల భారతీయ టాలెంట్ ఫెస్టివల్ నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని విద్యార్థులందరూ కూడా వారి వారి పోటీల్లో చక్కటి ప్రతిభను ప్రదర్శించి ముందుకు వెళ్లారని ఆయన వివరించారు.

కురబలకు చేయూతగా నిలుస్తా: అభినయ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): నగరంలో కురబలకు సముచిత స్థానం ఉంది అనడానికి కురబల ఆరాధ్య దైవమైన భక్త కనకదాస విగ్రహ ఏర్పాటుతో పాటుగా నగరంలోని మాస్టర్ ప్లాన్ రోడ్డుకు భక్త కనకదాసు మార్గంగా నామకరణం చేయడానికి ఇప్పటికే నగరపాలక కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకున్నామని తిరుపతి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ రెడ్డి తెలిపారు. ఆదివారం తిరుపతి నగర పరిధిలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్ లో కురబల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా భూమన అభినయ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కురబ సంఘం నాయకులు తిరుపతి పరిధిలో భక్త కనకదాస భవనం నిర్మాణానికి స్థల కేటాయింపు, భక్త కనకదాస విగ్రహం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన అభినయ రెడ్డి ఇప్పటికే రోడ్డు మార్గానికి నామకరణం చేశామని, నామకరణం చేసిన రోడ్డు మార్గంలో ఏదో ఒకచోట అనువైన ప్రాంతాన్ని ఎంచుకొని భక్త కనకదాస విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. రాబోవు ఎన్నికల్లో ఎంతో ముందు చూపుతో తిరుపతి నగరాభివృద్ధికి కష్టపడుతున్న తనను ఆదరించి తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు మల్లి, రెడ్డి కుమార్, శీను, హరినాథ్, వీరాంజనేయులు, రాచపల్లి రమేష్, రాజేశ్వరీ, పోతప్ప, నాగ సుబ్బయ్య, రవి, శీను తదితరులు పాల్గొన్నారు.

రాజీనామాకు ప్రజల మద్దతు కోరాను: అన్నా


సమావేశంలో మాట్లాడుతున్న అన్నా రామకృష్ణ యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మా కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ రాజీనామాకు సిద్ధపడ్డానని, ఇన్నేళ్లు నా వెంట నడిచిన జీవకోన ప్రజలను నా రాజీనామాకు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారని అన్నా రామకృష్ణ యాదవ్ తెలిపారు. ఆదివారం జీవకోనలో స్థానికంగా వందల మంది ప్రజలతో కలిసి భవిష్యత్తు కార్యచరణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నా రామకృష్ణ యాదవ్ మాట్లాడుతూ గడిచిన ఏళ్లుగా జీవకోన ప్రాంతం పంచాయతీగా ఉన్నప్పటినుండి ఇక్కడి ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందించడంలో అన్నా కుటుంబం ఎల్లప్పుడూ ముందుండి పోరాడిందన్నారు. అన్నా కుటుంబాన్ని వాడుకొని గద్దెనెక్కిన వ్యక్తి అన్నా రామచంద్ర యాదవ్ కుమార్తెకు తిరుపతి మేయర్ పదవి ఇస్తానని మాట ఇచ్చి తప్పడమే కాకుండా నేడు యాదవ సామాజిక వర్గానికి చెందిన వారితో లేనిపోని మాటలు అనిపిస్తూ కుయుక్త రాజకీయాలు చేయడం శోచనీయమన్నారు. అన్నా రామచంద్రయ్య యాదవ్‌తో పాటు తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని 48, 49 డివిజన్ల కార్పొరేటర్లు అన్నా సంధ్యా యాదవ్, అనిత యాదవ్‌లు ఇప్పటికే వైసీపీకి రాజీనామాలు చేశారన్నారు. తాను కూడా ప్రజల మద్దతు కోరి తన రాజీనామా అంశాన్ని ప్రజలకు తెలియజేశానన్నారు. జీవకోన ప్రజలందరూ తన రాజీనామాకు మద్దతు తెలిపారన్నారు. సోమవారం మీడియా ముఖంగా వందల మంది వైసీపీకి రాజీనామా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అన్నా రామచంద్ర యాదవ్, అన్నా మల్లీశ్వరి, రమణ యాదవ్, చిరంజీవి, దిలీప్, వెంకటేష్, మహేష్, బలరాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతరకు ఏర్పాట్లు సిద్ధం: ఈవో

ప్రజాశక్తి-చిల్లకూరు: మండలంలోని తూర్పు కనుమూరు గ్రామంలో వెలసిన శ్రీ ముత్యాలమ్మ అమ్మవారు జాతరకు ఏర్పాట్లు సిద్ధమైనట్లు ముత్యాల దేవస్థాన కార్యనిర్వాహణ అధికారి నవీన్ కుమార్ తెలిపారు. ఆయన విలేకరులతో వారితో మాట్లాడుతూ రేపటి నుంచి జరగబోవు అమ్మవారి జాతరకు ఏపీ నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, కేరళ రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో జాతరకు రానున్నారు. భక్తులు ఇటువంటి ఇబ్బందులకు లోను కాకుండా మౌలిక సదుపాయాలు కల్పించావని పేర్కొన్నారు. భక్తులకు ప్రయాణ సౌకర్యార్థం రోడ్లు మరమ్మతులు, మంచినీటి సరఫరా టాయిలెట్స్., తగినంత పోలీస్ బందోబస్తు తగినంత పోలీస్ బందోబస్తు ఫైరింజన్లు, తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

సీఎం సభాస్థలి పరిశీలన



ప్రజాశక్తి-నాయుడుపేట: సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ నెల 4న నాయుడుపేట పట్టణంలో నిర్వహించనున్న సిద్ధం సభ ఏర్పాట్లను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గ వైసీపీ నేతలు పరిశీలించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ వైసిపి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎన్డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, నాయకులు సుధాకర్ రెడ్డి, బాలచంద్రారెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజశేఖర్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తూ స్వచ్ఛంద పదవి విరమణ పొందిన రాజశేఖర్‌ను ఆదివారం ఎంఈఓలు రవీంద్రనాథ్,ముని సుబ్రహ్మణ్యంలతో పాటు తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. రాజశేఖర్ దంపతులకు శాలువా కప్పి గజమాల వేసి జ్ఞాపకం అందజేశారు. ఆయన విద్యార్థుల పట్ల అంకితభావంతో పనిచేశారని, ఉపాధ్యాయ వృత్తి సమాజంలో చాలా ఉన్నతమైనదని అటువంటి ఉపాధ్యాయ వృత్తికి కీర్తిని తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్లపూడి ఆదెయ్యకు సత్కారం

ప్రజాశక్తి-నాయుడుపేట: బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాయుడుపేట పట్టణంలోని జనరల్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేయుచున్న కర్లపూడి ఆదెయ్యకు పదవీ విరమణ సందర్భంగా ఆ పాఠశాలలో టీచర్లందరూ కలిసి ఘనంగా సన్మానించారు. విశ్రాంత స్టేట్ బ్యాంక్ మేనేజర్ కోటేశ్వరరావు, బామ్ సెఫ్ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి రామకృష్ణ, తిరుపతి బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రావు, జిల్లా మహిళ కార్యదర్శి సుశీలరవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ గాయత్రిలో వార్షిక కల్చరల్ ఫెస్ట్ 2కే24



ప్రజాశక్తి-గూడూరుటౌన్: పట్టణంలోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో వార్షిక కల్చరల్ ఫెస్ట్ 2కే24 వేడుకలు కరెస్పాండంట్ శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విలువలతో కూడిన చదువుతో పాటు ఆల్ రౌండ్ డెవలప్మెంట్ సాధించే దిశగా ముందుకు సాగాలని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం కాంపిటీషన్స్‌లో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్‌లు బహుకరించారు. పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సాయి సురేష్, రాధయ్య, కమలాకర్, శారద, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

నిద్రావస్థలో అటవీ అధికారులు

బుగ్గి పాలవుతున్న విలువైన అటవీ సంపద


అగ్నికి ఆహుతైన అటవీ సంపద

ప్రజాశక్తి - సోమల: సోమల మండలం అనగానే వేల ఎకరాల అటవీ భూములు, అడవుల్లో విలువైన వృక్ష సంపద, కనువిందు చేసే ప్రకృతి అందాలు, కిలకిల రావాలతో పక్షులు, ఎన్నో జంతువులు చల్లటి వాతావరణంతో జీవించేందుకు అనువైన ప్రదేశం గా పెద్దలు చెబుతూ ఉంటారు. అలాంటి విలువైన అటవీ సంపద కలిగిన బోనమంద, పేటూరు, అన్నెమ్మ గారి పల్లి, పెద్ద ఉప్పరపల్లి, ఆవులపల్లి, ఇరికిపెంట, 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీల పరిధిలోని అటవీ సంపద 20 రోజులుగా ఆకతాయిల అవగాహనా రాహిత్యం కారణంగా అటవీ సంపదకు నిప్పు పెట్టి అడవులను బుగ్గిపాలు చేస్తున్నారు. ఎన్నో జంతువులు, వృక్షాలు, పశువులకు మేతగా ఉపయోగపడే గడ్డి అగ్నికి ఆహుతి అవుతున్నాయి. అడవులకు అగ్గిపెట్టి బుగ్గిపాలు చేయడం వల్ల మానవులకు, భవిష్యత్తు తరాల వారికి కలిగే నష్టం పై అవగాహన కల్పించాల్సిన అటవీ శాఖ వారు నిద్రావస్థలో వుండడంతో నిత్యం ఏదో ఒక చోట అటవీ సంపద అగ్నికి ఆహుతై కార్చిచ్చుకు కాలిపోతోంది. గతంలో కళారూపాల ద్వారా గోడ పత్రికల ద్వారా మైకుల ద్వారా అటవీ సంపద అగ్నికి ఆహుతి కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అటవీ శాఖ ప్రచారం నిర్వహిస్తూ వచ్చేది. అయితే ఇటీవల కాలంలో ఆ ఆచారానికి స్వస్తి పలికి అటవీ సంపద బుగ్గిపాలు అవుతున్నా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తూ ఉండడంపై మండల ప్రజలు ఆ శాఖ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బోనమంద, పేటూరు ప్రాంతంలో వందల వేల ఎకరాలలో వెదురు పొదలు విస్తరించాయి. ఈ ప్రాంతంలో ఆకతాయిల చేష్టల వల్ల అగ్నికి వెదురు పొదలు పూర్తిగా ఆహుతై బీళ్లుగా మారుతున్నాయి. ఇకనైనా అటవీ శాఖాధికారులు విలువైన అటవీ సంపద అగ్నికి ఆహుతి కాకుండా అటవీ సమీప గ్రామ ప్రజలకు మండల ప్రజలకు అవగాహన కల్పించాల్సి వుంది. భవిష్యత్తు తరాలు అటవీ సంపద కోల్పోతే ఎంత నష్టపోతారన్న విషయాన్ని ప్రజలకు తెలిపి అడవులు కాలిపోకుండా విలువైన సంపద బుగ్గిపాలు కాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

వైసీపీలో చేరిక

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు రూరల్ మండలం తడుకు పంచాయతీకి చెందిన ఎంపీటీసీ సుబ్బరత్నమ్మ, గంగాధరం ఆధ్వర్యంలో ఆదివారం భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైసీపీలో చేరారు. వారికి మంత్రి రోజా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

తిరుపతిసిటీ: తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకం పంచాయతీకి చెందిన పలువురు ఆదివారం చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరారు. వారికి మోహిత్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మాధవ రెడ్డి, సర్పంచ్ శుభ పద్మనాభ రెడ్డి, నాయకులు వల్లీ, రెడ్డయ్య, మురళి, అవినాష్ రెడ్డి, శ్రావణ్, కిషోర్, కోదండ రామయ్య, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరులో ఎన్‌డిసిసిబి చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన ఆదివారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. పునబాకు, ఆర్లపాడు, అర్ధమాల గ్రామాల నుండి పలువురు వైసీపీలో చేరారు.

టీడీపీలో చేరిక..

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: మున్సిపాలిటీలోని 25, 26వ వార్డుకు చెందిన పలువురు వైసీపీ నాయకులు ఆదివారం టీడీపీ నగిరి ఎమ్మెల్యే అభ్యర్థి భాను సమక్షంలో టీడీపీలో చేరారు. కార్తిక్, గాంగాధరం, భానుకిరణ్, మోహన్, తులసి, వినోద్‌లు చేరారు.

గూడూరుటౌన్: పట్టణానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. షేక్ షబ్బీర్, ఎస్.కె.మున్నా, గోల్డెన్ గౌస్‌ల ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన యువత టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి డాక్టర్ పాశం సునీల్ కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి మండలంలోని అగరాలలో వైసీపిని వీడి భారీ సంఖ్యలో పలు కుటుంబాలు టిడిపిలో చేరారు. ఆదివారం అగరాలలో నిర్వహించిన టిడిపి ఆత్మీయ సమావేశంలో స్థానిక టిడిపి నాయకుడు ఎల్లప్పరెడ్డి ఆధ్వర్యంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో టిడిపిలో చేరారు. పులివర్తి నాని వారిని సాదరంగా ఆహ్వానించారు.

గడ్డివామి దగ్ధం


మంటలు అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

ప్రజాశక్తి-కోట: మండలంలోని నెల్లూరుపల్లి కొత్తపాలెం దళితవాడలో ఆదివారం అకస్మాత్తుగా గడ్డివామి దగ్ధమైంది. గ్రామస్తుల కథనం మేరకు.. నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు గడ్డివామి ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం గడ్డివామిలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని చివరి దశలో మంటలు అదుపు చేశారు. ఆకతాయిల పనే అయియుంటుందని బాధితుడు శ్రీనివాసులు తెలిపారు. రూ.25వేల వరకూ నష్టం జరిగినట్లు పేర్కొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-ఏర్పేడు: లారీ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం మండలంలోని ఐఐటీ వద్ద చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బాలకృష్ణాపురం గ్రామంలోని రామాలయం సమీపంలోని గిరిజన కాలనీకి చెందిన కేశవులు ఐజర్ ఐఐటీ మధ్యలో గుర్తు తెలియని లారీ ఢీకొట్టింది. దీంతో అతనికి తీవ్ర గాయాలైయ్యాయి. కాగా అతినితో పాటు వెళుతున్న ఇద్దరు పిల్లలు సురక్షితంగా బయటపడ్డారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు


మీడియాకు వివరాలను వెల్లడిస్తున్న సీఐ

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట పట్టణంలో మార్చి 17వ తేదీ జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఆదివారం నాయుడుపేట స్టేషన్‌లో సీఐ శ్రీనివాసరెడ్డి ముద్దాయిని అరెస్ట్ చూపారు. వివరాలను మీడియాకు వివరిస్తూ.. తిరుపతి సమీపంలోని కృష్ణాపురానికి చెందిన ఈటిపాకం నరేష్ మార్చి 17న పెళ్లకూరు మండలం కలవకూరులోని తన అత్తగారింటికి వచ్చాడు. అక్కడ చేపల వేటకోసం వెళ్లగా చేపలు దొరకక పోవడంతో అదేరోజు అర్ధరాత్రి నాయుడుపేటలోని బంగారు దుకాణంలో చోరీకి పాల్పడ్డట్టు విచారణలో తేలిందని సీఐ వివరించారు. దుకాణం షట్టర్ పగలగొట్టి 15గ్రాముల బంగారు, 6కేజీల వెండి పట్టీలు దోచుకెళ్లాడు. అతను చోరీకి పాల్పడుతున్న సంఘటన పూర్తిగా సీసీ ఫుటేజీలో రికార్డు కావడంతో దర్యాప్తు ముమ్మరం చేశామని సీఐ తెలిపారు. ప్రత్యేక బృందంతో గాలించి నరేష్‌ని అరెస్ట్ చేశామన్నారు. అతిని వద్ద నుంచి రూ.వెయ్యి, 15గ్రాముల బంగారు, 6కేజీల వెండి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు చెప్పారు. కేసులో ప్రతిభ చూపిన సిబ్బందిని ఆయన అభినందించారు.

ద్విచక్ర వాహనం చోరీ

ప్రజాశక్తి-రామచంద్రపురం: మండలంలోని నెత్తుకుప్పం గ్రామంలో ద్విచక్ర వాహనం శనివారం రాత్రి చోరీకి గురైంది. నెత్త కుప్పం గ్రామానికి చెందిన దొరస్వామి ఇంటి వద్ద ఏపీ03 సిఎస్ 7957 నెంబర్ గల అపాచీ ద్విచక్ర వాహనాని ఇంటి ముందు పార్కింగ్ చేసి హ్యాండిల్ లాక్ చేశారు. దొంగలు అర్ధరాత్రి సమయంలో ద్విచక్ర వాహనాన్ని హ్యాండిల్ లాక్ పగలగొట్టి తీసుకెళ్లిపోయారు. ఉదయం నిద్ర లేచి ఇంటి ముందు ఉంచిన ద్విచక్ర వాహనం లేదు. దీంతో ఆర్‌సి పురం పోలీసులకు ఫిర్యాదు చేశామని ద్విచక్ర వాహన యజమాని తెలిపారు. గత రెండు నెలల్లో నెత్త కుప్పం గ్రామంలో చంగల్ రాయులు ఇంట్లో 32గ్రాముల బంగారు నగలు చోరీకి గురైయ్యాయి. మరో ఇంట్లో రూ.మూడు లక్షల 45 వేలు చోరీకి గురైంది. వరుస చోరీలతో నెత్తకుప్పం గ్రామంలో ప్రజలు దొంగల బెడదతో భయభ్రాంతులకు గురవుతున్నారు. వరుస చోరీలను అరికట్టడంలో పోలీసులు పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని గ్రామస్తుల ఆరోపిస్తున్నారు. ఇకనైనా పోలీసులు స్పందించి రాత్రిపూట గస్తీలు నిర్వహించాలని మండల ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎస్ఐ చిరంజీవిని వివరణ కోరగా ఫిర్యాదులు వచ్చాయి విచారణ చేస్తున్నామన్నారు. దొంగలు పట్టుకుని వస్తువులను రికవరీ చేస్తామని తెలిపారు.

జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: పేకాట ఆడుతున్న ప్రాంతంపై పోలీసులు దాడి చేసి ఆరు మందిని అదుపులోకి తీసుకున్న సంఘటన ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బిఆర్ హాస్పిటల్ రోడ్డులోని ఓ రూమ్‌లో పేకాట నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఈస్ట్ చేస్తే లావణ్య తన సిబ్బందితో దాడి చేసి, పేకాట ఆడుతున్న ఆరుగురును అదుపులో తీసుకొని, వారి వద్ద నుంచి రూ.18200నగదు, ఆరు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేశారు.

పీవీఆర్ కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే మంతనాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డి ఆదివారం పీవీఆర్ కుటుంబ సభ్యులతో సమావేశం అయ్యారు. ఈ ఎన్నికల్లో పట్టణంలో అధిక ప్రజాదరణ ఉన్న పీవీఆర్ కుటుంబ సహకారం తనకు అవసరం అన్నారు. ఈ ఎన్నికల్లో తన విజయానికి సహకారం అందించాలన్నారు.

ఆశీర్వదించండి: నెలవల

ప్రజాశక్తి-ఓజిలి: టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేయడమే కార్యకర్తలు లక్ష్యంగా పనిచేస్తున్నారని టిడిపి సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. మండలంలోని చిలమానుచేను గ్రామంలో సార్వత్రిక ఎన్నికలలో భాగంగా టిడిపి నాయకులతో కలిసి నెలవల విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం ఆదివారం ప్రచారం ప్రారంభించారు. టిడిపి మండల అధ్యక్షుడు గుజ్జలపూడి విజయ్‌కుమార్ నాయుడు, ఎల్లంరాజు మధుశేఖర్ రాజు, టిడిపి నాయకులు స్వాగతం పలికారు. పలువురు టీడీపీలో చేరారు.

